క్లుప్తంగా

పాఠ్య పుస్తకాల పంపిణీ



శావల్యాపురం: స్థానిక మండల వనరుల కేంద్రంలో పాఠశాలల వారీగా ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను ఎంఈఓ లలితాకుమారి గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులందరికీ విద్యా కానుక కిట్లు పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి నూరుశాతం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆమె తెలిపారు. 1 నుంచి 5 తరగతి వరకు 2,688, 6 నుంచి 10వ తరగతి వరకు 7,017 పాఠ్య పుస్తకాలను మొదటి విడతగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ లింగాల శ్రీహరి, మస్తాన్‌రావు ఉన్నారు.

రేపు తాగునీటి సరఫరా బంద్

నరసరావుపేట: పట్టణంలో శనివారం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు తాగునీరు శుద్ధి చేసి అందించే శాంతినగర్ ప్లాంట్‌లో మరమ్మతులు చేపట్టనుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆదివారం నుంచి యథావిధిగా మంచినీటి సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు.

చెరుకూరి సృజనకు నాట్స్ సంస్థ సేవా పురస్కారం



యద్దనపూడి: స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ చెరుకూరి సృజనకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి, అందించే అరుదైన ఈ పురస్కారాన్ని గురువారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నాట్స్ అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా ఆమె అందుకున్నారు. 30 మంది ఉపాధ్యాయులకు, ఐదుగురు కవులకు, పలు కళలకు చెందిన కళాకారులకు, 100 మంది జానపద కళాకారులతో పాటు ఈ పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని సృజన తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

యద్దనపూడి: గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తిమ్మాపురం గ్రామ పరిధిలోని బుధవారం రాత్రి అదే గ్రామంలోని ఎస్సీ కాలనీకు చెందిన పుల్లగూర అంజమ్మ(70) గుడారాల పండుగకు వెళ్లేందుకు వాహనం కోసం 16వ నంబర్ జాతీయ రహదారిపైకి వచ్చింది. అదే సమయంలో వేగంగా దూసుకువచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొబైల్ దుకాణంలో చోరీకి విఫల యత్నం



నాదెండ్ల: సెల్‌ఫోన్ దుకాణంలో ఓ దుండగుడు చోరీకి యత్నించి విఫలమైన ఘటన గణపవరం గ్రామంలో గురువారం వెలుగులో కొచ్చింది. షాపు యజమాని పోలూరి శరత్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని మెయిన్ రోడ్డులో శ్రీలక్ష్మి సాయి సెల్ షాపు నిర్వహిస్తున్నానన్నాడు. బుధవారం రాత్రి 9 గంటలకు షాపు మూసివేసి వెళ్లగా.. గురువారం ఉదయం షాపు తెరిచేందుకు చూడగా.. షట్టర్ తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించాడు. షట్టర్ లాకులు తెరిచేందుకు యత్నించి విఫలమైనట్లు గుర్తించాడు. సీసీ కెమెరా పుటేజీని పరిశీలించగా రాత్రి 1.45 నిమిషాలకు షట్టర్ తాళాలు పగలగొట్టి లాకులు తీసేందుకు యత్నించిన విఫలమైనట్లు రికార్డు అయ్యుండటాన్ని గుర్తించాడు. దీంతో నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోషకాలతో రుచికర భోజనం అందించాలి

భోజన నిర్వాహకులకు మండల విద్యాశాఖాధికారుల శిక్షణ



బహుమతి అందజేస్తున్న ఎంఈఓ లలితకుమారి



మాట్లాడుతున్న ఎంఈఓ సయ్యద్ జఫ్రుల్లా

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాలతో కూడిన రుచికరమైన భోజనం అందించే బాధ్యత మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు వహించాలని ఎంఈఓ పుసులూరి లలిత కుమారి అన్నారు. గురువారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెనూ తప్పక అమలు చేయాలని చెప్పారు. ఉపాధ్యాయులు నిర్వాహకుల సమన్వయంతో నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. వీటితో పాటు వేరుశనగ చిక్కీలు, రాగిజావ తయారీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. వంటగది, వంట పాత్రల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలను ఎంఈఓ అడిగి తెలుసుకున్నారు. విధుల్లో అలసత్వం వహించకూడదని, నిరంతరం తనిఖీలు చేస్తామని హెచ్చరించారు. వంటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు శివప్రసాదు, శ్రీనివాసరావు, ఏడుకొండలు, ఎంఆర్సీ సిబ్బంది తివిక్రమ్, శ్రీహరి, మస్తాన్ పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం వండాలి

బొల్లాపల్లి: విద్యార్థులకు రుచికరమైన భోజనం తయారు చేయాలని ఎంఈఓ సయ్యద్ జఫ్రుల్లా అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీల నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలో ప్రతిరోజు మెనూ ప్రకారం, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని స్పష్టం చేశారు. బయట వండిన పదార్థాలను తీసుకురావద్దని చెప్పారు. ప్రభుత్వ నిర్దేశాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు సుకుంటామని హెచ్చరించారు. అనంతరం నిర్వాహకులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కె.పార్వతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వి.పద్మావతి, రీసోర్స్‌పర్సన్ అంజలి పాల్గొన్నారు.

రుచిగా గోరుముద్ద..



మధ్యాహ్న భోజనం రుచిచూస్తున్న ఎంఈవోలు, హెచ్‌ఎంలు

నాదెండ్ల: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మరింత పోషకాలు, రుచిగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో-1 కె.శ్రీలక్ష్మి, ఎంఈవో-2 ఈమని కృష్ణారెడ్డి తెలిపారు. నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాలల హెచ్‌ఎంలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థులకు శుచి శుభ్రతతో ఆహారాన్ని అందించాలన్నారు. మెనూలో ప్రభుత్వం మార్పులు చేసిందన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యేనాటికి జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు చెప్పారు. అనంతరం నిర్వాహకులకు మెనూపై వంటల పోటీలు నిర్వహించి, రుచిగా తయారు చేసిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు నిర్మల, కె.మోహన్, రిసోర్స్ పర్సన్‌లు విజయలక్ష్మి, రాము, సీఆర్పీలు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో పంటకు మేలు

- చీడపీడలు, తెగుళ్ల నివారణ
- అధిక దిగుబడులకు అవకాశం
- పత్తి, పొగాకు, మిర్చి, శనగకు అధిక ధరలు
- స్వల్పంగా పెరిగిన కౌలు ధరలు



గణపవరంలో ట్రాక్టర్ నాగలితో లోతుగా దుక్కి చేస్తున్న రైతు

నాదెండ్ల: వేసవిలో లోతుగా దుక్కులు దున్నుకుంటే రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. రైతులు పంట పూర్తయిన అనంతరం వ్యర్థాలను తొలగించి పొలాన్ని సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు. కంప మొక్కలు తొలగించి, ట్రాక్టర్ సాయంతో లోతుగా దున్నుకున్నట్లయితే గత పంటల చీడపీడలు నశించి, పంటలకు నష్టం వాటిల్లకుండా ఉంటుందని చెప్తున్నారు. కౌలు రైతులు వేసవి దుక్కులు తగ్గించడంతోనే ఆశించిన దిగుబడులు రావడం లేదంటున్నారు. దుక్కులు దున్నే ముందు పొలంలో పశువుల ఎరువు, గొర్రెలు, మేకల ఎరువు వేసుకోవాలి. మట్టిని వెదజల్లి నేలను కలియదున్నాలి. దీంతో భూమి సారవంతమవుతుంది. భూమిలో తేమ ఎక్కువ నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుంది. దీని వల్ల పంటలకు నష్టం కల్గించే చీడపీడలు నాశనమవుతాయి. వేసవి దుక్కులతో కలుపు విత్తనాలు, నిద్రావస్థలో ఉన్న పురుగులు, వివిధ రకాల తెగుళ్ల, శిలీంద్ర జాతులు అధిక వేడికి నాశనమవుతాయి.

పెరిగిన కౌలు ధరలు..

నాదెండ్ల మండలంలో 25 వేల ఎకరాల సాగు భూమి ఉంది. గతేడాది మండలంలో పత్తి 5,900 ఎకరాల్లో సాగయ్యింది. మిర్చి 4,400, పొగాకు 350, శనగ వెయ్యి ఎకరాల్లో రైతులు సాగు చేశారు. మొదటి నుంచి పంటల సాగు బాగానే ఉన్నా, చివర్లో మిచాంగ్ తుపాను కారణంగా కొంత పంట నష్టం జరిగింది. పత్తి, మిర్చి సాగు ఖర్చులు అధికమవుతున్నా.. మార్కెట్‌లో పంట ధరలు కూడా ఆశించిన స్థాయిలో ఉన్నాయి. మిచాంగ్ తుపాను ప్రభావం తర్వాత పత్తి, మిర్చి తొలగించిన రైతులు పొగాకు సాగుకు మొగ్గు చూపారు. ఈ ఏడాది బహిరంగ మార్కెట్లో పొగాకు క్వింటా ధర రూ.15-16 వేలు పలకడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పత్తి క్వింటా రూ.7 వేలకు మించి ధర పలికింది. ఇదే అదనుగా భూ యజమానులు కౌలు ధరలను పెంచేశారు.

భూసారం ఆధారంగా సాగు మేలు



వేసవిలో లోతైన దుక్కుల అనంతరం భూసార పరీక్షలు చేయించాలి. ఫలితం ఆధారంగా పంటలు సాగు చేస్తే రైతులకు మంచి దిగుబడులు వస్తాయి. ప్రస్తుతం జూన్ నుంచి అక్టోబరు ఖరీఫ్ కొనసాగుతుంది. ఇప్పటికే రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. ఖరీఫ్ ప్రారంభం కాగానే రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకున్నట్లయితే ఆర్‌బీకేల ద్వారా పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తారు.

– ఎ.హరిప్రసాద్, వ్యవసాయాధికారి, నాదెండ్ల.

నుదుటి రాత మార్చే.. చక్కని చేతి రాత

ముగిసిన సమ్మర్ క్యాంప్



జున్ను మాష్టార్‌ని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు, అతిథులు

యద్దనపూడి: చక్కని చేతిరాతతో మనిషి నుదుటి రాతను మార్చుకునే గొప్ప శక్తి దాగున్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలని కాలీగ్రఫీ ఎక్స్‌పర్ట్ షేక్ జున్నుసాహెబ్ మాష్టారు అన్నారు. మండల విద్యార్థులకు వివిధ రంగాల్లో తర్ఫీదునిచ్చే వేసవి విజ్ఞాన తరగతులు ముగిశాయి. యద్దనపూడి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మే ఒకటో తేది నుంచి ప్రారంభమైన సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుక సమావేశం గురువారం జరిగింది. స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో గణిత ఉపాధ్యాయులు కల్లూరు వాసు అధ్యక్షత వహించి మాట్లాడారు. సమ్మర్ క్యాంప్ 30 రోజుల్లో జరిగిన అంశాలను వివరించారు. ముఖ్య అతిథి పీఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు ముత్తవరపు రామారావు మాట్లాడుతూ మండలంలోని విద్యార్థులంతా వేసవి ఎండలను తప్పించుకుంటూ ఒకచోట చేరి సరదాగా గడిపేందుకు సమ్మర్ క్యాంపు వేదికగా నిలిచిందన్నారు. క్యాంపు నిర్వహణతో వారిలో సామాజిక నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు దోహదపడతాయన్నారు. పుడమి బిల్డర్స్ అధినేత డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు సమ్మర్ క్యాంపు నిమిత్తం అందించిన రూ.50వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. మలినేని ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టర్ పోపూరి రమేష్ బాబు మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు విద్యార్థులు సరైన లక్ష్యం, చక్కని ఏకాగ్రత, కష్టపడే తత్వం ఏర్పరచుకోవాలన్నారు. క్యాంపులో విద్యార్థులకు చక్కని చేతిరాతను నేర్పించిన జున్నుసాహెబ్‌ను కమిటీ సభ్యులు, అతిథులు ఘనంగా సత్కరించారు. జున్నుమాష్టారు మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులు విద్యార్థులకు అన్ని రంగాల్లోనూ ప్రవేశాన్ని కల్పించి వారి అభిరుచుల్ని, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపయోగపడతాయన్నారు. ఆయన రాసిన హ్యాండ్ రైటింగ్ బుక్‌ను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ సృజన, ప్రధానోపాధ్యాయుడు కేవీ రామిరెడ్డి, గ్రామ పెద్దలు కనిగంటి నాగేశ్వరరావు, పోపూరి వెంకటేశ్వర్లు(చిన్న) అనంతలక్ష్మి, కేతా రామబ్రహ్మం, కురంగి నాగమల్లేశ్వరరావు, నక్క వెంకటేశ్వర్లు, మీరావలి, రమాదేవి , వంశీ లక్ష్మీనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆచార్య ఎన్జీ రంగా శిష్యుడు కన్నుమూత



నాదెండ్ల: ఆచార్య ఎన్జీ రంగా శిష్యుడు, గణపవరం సీఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు వంకాయలపాటి సాంబశివరావు (83) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. ఆయన ఆచార్య ఎన్జీ రంగా నెలకొల్పిన స్వతంత్ర్య పార్టీలో ప్రధాన భూమిక పోషించారు. వ్యవసాయం రంగంలో ఆదర్శవంతమైన రైతుగా నిలిచారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ పూర్తి చేసి, పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి ప్రభుత్వ కళాశాలలో రెండేళ్ల చరిత్ర అధ్యాపకుడిగా పని చేశారు. 1978లో గణపవరం సీఆర్ కళాశాలలో అధ్యాపకుడిగా చేరి 1997లో వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ఆయన స్వగ్రామం ప్రకాశం జిల్లా చీరాల సమీపంలోని స్వర్ణ గ్రామం. సీఆర్ కళాశాలలో పనిచేసిన కాలంలో గణపవరం, చిలకలూరిపేటలో నివాసం ఉన్నారు. ఆయన మృతి పట్ల సీఆర్ కళాశాల అధ్యాపక బృందం, కళాశాల యాజమాన్యం తమ ప్రగాఢ సానుభూతిని తెలిపింది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనారోగ్యంతో వైస్ ఎంపీపీ లక్ష్మి మృతి



నరసరావుపేట రూరల్: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అల్లూరివారిపాలెం ఎంపీటీసీ, మండల వైస్ ఎంపీపీ యాంపాటి లక్ష్మి(41) గురువారం మృతి చెందారు. సోమవారం సల్ప అస్వస్థతకు గురైన ఆమెకు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం వైస్ ఎంపీపీ లక్ష్మి మృతిచెందారు. మృతదేహాన్ని గురువారం రాత్రి అల్లూరివారిపాలెంలోని స్వగృహానికి తీసుకొచ్చారు. లక్ష్మి మృతదేహానికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. మృతురాలి భర్త వెంకటప్పారెడ్డికి సంతాపం తెలియజేశారు.

277 మందికి క్షయ వ్యాధి నిరోధక టీకాలు



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో క్షయ వ్యాధి నిరోధక టీకాలు గురువారం 277 మందికి వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. రొంపిచర్ల ఆరోగ్య కేంద్రం పరిధిలో 119, వి.రెడ్డిపాలెం ఆరోగ్య కేంద్ర పరిధిలో 158 మందికి టీకాలు వేసినట్లు వెల్లడించారు. ఈ క్యాంపులను వైద్యాధికారులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.జగన్ నరసింహారెడ్డి, డాక్టర్ రేవతిబాయి, ఎంపీహెచ్‌ఈవో ఎస్.ఎస్.సురేష్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు రామయ్య, కిరణ్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా బీసీజీ వ్యాక్సిన్లు

నాదెండ్ల: గణపవరం, నాదెండ్ల పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయాల్లో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ నిర్వహించారు. అరవై ఏళ్ల పైబడిన, డయాబెటిక్, పొగతాగే అలవాటు ఉన్న వారు, టీబీ బాధితులు వారి కుటుంబ సభ్యులందరికి బీసీజీ వ్యాక్సిన్లు వేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 16న ప్రారంభమైన వ్యాక్సినేషన్ మూడు నెలల పాటు కొనసాగుతుందని, అన్ని సచివాలయాల్లో ప్రతి గురువారం వ్యాక్సిన్లు ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. గణపవరం పీహెచ్‌సీ పరిధిలో 200, నాదెండ్ల పీహెచ్‌సీ పరిధిలో 220 మందికి వ్యాక్సిన్లు వేసినట్లు వైద్యాధికారులు ప్రసాద్‌నాయక్, కవిత అనసూయ, సాయిశ్వేత తెలిపారు.

వైభవంగా శివ కల్యాణం

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శివ కల్యాణం వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం పవళింపు సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీవాసవి అమ్మవారి మూల విరాట్‌కు విశేష అభిషేకాలు జరిపి, ప్రత్యేక అలంకరణలు గావించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమాసు వెంకటమల్లారావు, కార్యదర్శి మిరియాల నాగప్రసాదరావు, కోశాధికారి కె.కె.విశ్వనాథరావు, సలహా సంఘం సభ్యులు ఎం.రామబ్రహ్మానందరావు, చేగు వెంకటేశ్వరరావు, కొత్తూరి వెంకటలక్ష్మి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

శావల్యాపురం : అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా పలు జాగ్రత్తలు పాటించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ సూచిస్తున్నారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆయన పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లేప్పుడు గొడుగు తీసుకెళ్లాలి. తెలుపు రంగు పలుచటి వస్త్రాలు ధరించాలి. తలకు టోపీ లేదా టవల్ కట్టుకోవాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల మధ్య కాలంలో బయట అధిక శారీరక శ్రమతో పని చేయకూడదు. శీతల పానియాలు, ఐస్ ముక్కలు తీసుకుంటే గొంతుకు సంబంధించిన వ్యాధులొచ్చే ప్రమాదం ఉంది. అలాగే. చెమట పట్టకపోవటం.. శరీర ఉష్ణోగ్రత పెరగటం, వణుకు పుట్టటం, నిద్రలేక కలవరింతలు వడ దెబ్బ లక్షణాలుగా గుర్తించాలి.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఎస్పీ మలికా గార్గ్



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ మలికా గార్గ్

వినుకొండ(నూజెండ్ల): ఎన్నికల సందర్భంగా చెలరేగిన గొడవలను ఉక్కుపాదంతో అణచివేస్తామని పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ హెచ్చరించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటరులో గురువారం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలతో ఆమె సమావేశమయ్యారు. ప్రస్తుతం పల్నాడు జిల్లా వైపు దేశం మొత్తం చూసేలా శాంతి భద్రతలు కొరవడ్డాయన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన 10 రోజుల వ్యవధిలోనే 1,200 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. మరో 400 మందిపై రౌడీ షీట్ ఓపెన్ చేశామన్నారు. జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జూన్ 1 నుంచి కౌంటింగ్ ముగిసే వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల గొడవల్లో పాల్గొన్న కేసుల్లో ఇరుక్కొని యువత బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హితవు పలికారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి, సైబర్ క్రైమ్ కేసులు నమోదు చేస్తామన్నారు. పల్నాడు జిల్లాలో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాజకీయ నాయకుల కోసం సామాన్య ప్రజలు గొడవలకు వెళ్లి జీవితాలు పాడు చేసుకోవద్దని ఎస్పీ మలికా గార్గ్ విజ్ఞప్తి చేశారు.

రేపు హనుమజ్జయంతి వేడుకలు



గణపవరం కోదండరామాలయంలో..

వినుకొండ(నూజెండ్ల): హనుమజ్జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని శ్రీ గుంటి ఆంజనేయస్వామి, దక్షిణ బజారులోని గమిడి ఆంజనేయస్వామి, పుట్టాబత్తుని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ దీక్షాపరులు, భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. స్వామికి లక్ష తమలపాకుల పూజ, అభిషకాలు, ప్రత్యేక అలంకరణలు చేపట్టనున్నారు. అన్న సంతర్పణ కార్యక్రమాలు ఉంటాయని ఆయా ఆలయాల కమిటీల సభ్యులు తెలిపారు.

ప్రారంభమైన హనుమజ్జయంతి వేడుకలు

నాదెండ్ల: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని ఆలయాల్లో గురువారం వేడుకలు ప్రారంభమయ్యాయి. గణపవరం - కావూరు డొంక రోడ్డులోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో, రూ.2 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన కోదండరామాలయంలో, శాంతి నగర్‌లోని కోదండరామాలయంలో స్వామివారికి అభిషకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణ, అనిల్‌కుమార్, ఉమామహేశ్వరశర్మ పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం 7 గంటలకు గణపతిపూజ, పుణ్యావచనం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, 9 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర, తమలపాకులతో విశేషహారతి నిర్వహించారు.

నూజెండ్లలో నగరోత్సవం

వినుకొండ(నూజెండ్ల): హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా నూజెండ్ల గ్రామంలో ఆంజనేయస్వామి దీక్షదారులు గురువారం నగరోత్సవం నిర్వహించారు. శనివారానికి 41 రోజులు పూర్తి చేసుకొని, హనుమత్ వ్రతం ఇరుముడులు కట్టుకొని జాపాలి క్షేత్రం వెళ్లే సందర్భంగా భిక్షాటన, హరేరామ సంకీర్తనతో గ్రామంలో ఊరేగింపు చేశారు. గ్రామాల్లోని అన్ని దేవాలయాల్లోని దేవతా మూర్తులకు అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనరు రవిచంద్రారెడ్డి

నరసరావుపేట: మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి గురువారం 26వ వార్డు చెరువుగట్టు శివాలయం బజార్, 31వ వార్డు బరంపేట పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ వార్డుల్లో నిర్వహిస్తున్న శానిటేషన్ డ్రైవ్‌ను పరిశీలించారు. శివాలయం వద్ద మేజర్ డ్రెయిన్‌లో కరెంటు స్తంభానికి సంబంధించిన సైడ్ దిమ్మ పడడం వల్ల ఆ డ్రైన్‌లో చెత్త మొత్తం నిలిచి ఉండడం గమనించారు. వెంటనే సంబంధిత శానిటేషన్ అధికారులను పిలిపించి జేసీబీ ద్వారా వాటిని తొలగించి, నీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వెంటనే పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టరు రామకోటయ్య, వెంకటేశ్వర్లు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ రాము నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.